క్లుప్తంగా

నిరసనకు అనుమతివ్వాలని వినతి



దరఖాస్తు అందిస్తున్న ఎంపీటీసీ రమేష్‌నాయుడు

జి.సిగడాం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీటీసీలకు గౌరవ భృతి చెల్లించాలని కోరుతూ నిరసన చేపట్టనున్నట్లు డీఆర్‌వలస ఎంపీటీసీ సభ్యుడు కుమరాపు రమేష్‌నాయుడు తెలియజేశారు. ఈ మేరకు అనుమతినివ్వాలని పోలీసులకు బుధవారం దరఖాస్తు చేశారు. రెండు సంవత్సరాలుగా గౌరవ భృతి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ర్యాలీలు, నిరసనలకు అనుమతి లేదని ఏఎస్‌ఐ పొగిరి శంకరరావు స్పష్టం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి అధ్వర్యంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ సమక్షంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అవసరమైనవారికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ముద్దాడ గౌరీ, శిరిగిడి గోవిందరావు, పొగిరి రాము తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం యూనిట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ టి.శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇటీవల మరణించారు. దీంతో ఆయన సతీమణి కె.ఉదయకుమారిని కారుణ్య నియామకంలో భాగంగా హోంగార్డుగా నియమించారు. నియమకపత్రాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం అందజేశారు. అలాగే సహచర హోంగార్డులు తమ ఒక్కరోజు గౌరవ వేతనం రూ.4.06 లక్షలను చెక్కు రూపంలో ఎస్పీ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీవో ఏవో సీహెచ్ గోపీనాథ్, ఆర్ఎస్ఐ-1 వెంకటరమణ, క్లర్క్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరం



మాట్లాడుతున్న హెల్త్ కౌన్సిలర్ రాజశేఖర్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమని జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రాజశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.విజయకుమారి ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఉన్నతమైన కెరీర్‌ను ఎంచుకునే అవకాశం వారికే ఇవ్వాలన్నారు. వారి శారీరక, మానసిక ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానసికంగా ఆందోళనకు గురయ్యే విద్యార్థులతో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మాట్లాడి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ సిద్దార్థ, కమిటీ సభ్యులు, ఇన్‌చార్జి పి.రవికుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో పాటిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని శ్రీకాకుళంలో బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 30 మంది రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, శ్రీకాకుళం డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, పీఆర్వో సుమన్, రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ పి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడం.. దిగుబడి అపారం..!



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- అందుబాటులోకి వేరుశనగ కొత్త వంగడం
- టీసీజీఎస్–1694తో రైతుకు మేలు
- ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి

జి.సిగడాం: వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు కొత్తరకం వంగడం టీసీజీఎస్–1694(విశిష్ట)ను వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ రకం సాగు చేయడం వలన సాధారణం కంటే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ అనూష, డాక్టర్ రోయా, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాణిలు రైతులకు ఈ వంగడంపై అవగాహన కల్పించారు. ఎవరైనా రైతులు విత్తనం ఉత్పత్తి కోసం పండిస్తే నేరుగా ఆమదాలవలస కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి విత్తనాలను కొనుగోలు చేసి దగ్గరుండి పంటను పండిస్తారు.

చెట్టుపొదిలాంలో సాగు

చెట్టుపొదిలాం గ్రామంలో 25 మంది రైతులు టీసీజీఎస్–1694(విశిష్ట) వేరుశనగ పంటను సాగు చేశారు. దీనికోసం ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద సూచనలు అందించారు. ఒక్కొక్క రైతు పంటపై ప్రత్యేక శ్రద్ధ వహించి సాగు చేయడంతో ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించారు.



గుత్తులుగా కాసిన వేరుశనగ పంట

యాజమాన్య పద్ధతులు

మెట్ట ప్రాంతాల్లో సాగు చేస్తున్న ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన అవసరం. పంటలో కుళ్లు తెగులు నివారణకు టి.వీరిడి, జీవి సిలింద్రాన్ని పశువుల గెత్తంలో 10 రోజుల ముందు కలిపి, పొలంలో వేస్తే కుళ్లు తెగుళ్ల నివారణ చేపట్టవచ్చు. పూత దశలో పువ్వు నేలరాలకుండా ఉండేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

30 క్వింటాళ్ల దిగుబడి



నేను ఎకరా భూమిలో టీసీజీఎస్–1694 (విశిష్ట) వేరుశనగ రకం పంటను సాగు చేశాను. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయశాఖ సూచనలు ఇచ్చారు. ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మొక్కజొన్న పంట కంటే అధిక దిగుబడులు సాధించాం.

– దోల చిన్నంనాయుడు, వేరుశనగ రైతు, చెట్టుపొదిలాం

సూచనలు పాటించాలి



రైతులు పండించే వేరుశనగ పంటకోసం నీటి యాజమాన్యం పద్ధతులు పాటించాలి. సమగ్ర పద్ధతుల ద్వారా ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు సాధించగలరు. ముందు రైతులు విత్తనం ఎంపిక చేసుకోవాలి. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

– యర్రా శారద, ఏవో, జి.సిగడాం

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవనంలో ఉపాధ్యాయ సంఘాలు బలపరుస్తున్న ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి విజయ గౌరీని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరుతూ కరపత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి గౌరీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్ యాదవ్, కె.అప్పారావు, బి.కృష్ణమూర్తి, సురేష్, స్వర్ణకుమారి, నాగమణి, దుర్గాప్రసాద్, చిన్నరావు తదితరులు పాల్గొన్నారు.

14న ‘ఘంటసాల ది గ్రేట్’ రిలీజ్



మాట్లాడుతున్న డైరెక్టర్ రామారావు

శ్రీకాకుళం కల్చరల్: మధుర గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తీసిన ‘ఘంటసాల ది గ్రేట్’ చిత్రాన్ని ఈనెల 14వ తేదీన మారుతీ థియేటర్‌లో విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత, డైరెక్టర్ సీహెచ్ రామారావు తెలిపారు. స్థానికంగా ఒక ప్రైవేటు హోటల్‌లో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక గాయకుడిపై పూర్తిస్థాయిలో చిత్రం రావడం ఇదే మొదటిసారి అన్నారు. సినిమాలో గాయకుడు కృష్ణచైతన్య, యాంకర్ మృదుల నటనతో ఆకట్టుకున్నారని తెలిపారు. ఒకే టిక్కెట్టుపై ఇద్దరు వ్యక్తులు సినిమా చూసే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. సమావేశంలో వ్యాపారవేత్త నటుకుల మోహన్, చక్రవర్తి, గాయకుడు బగాది కూర్మారావు, ఈవెంట్ మేనేజర్ సాయి బాబు, మార్గదర్శి శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు

యూరియా వచ్చింది



సాక్షి ఎఫెక్ట్...

తూలుగు పీఏసీఎస్ గోడౌన్‌లో ఉన్న యూరియా బస్తాలు

గార: మండలంలో యూరియా కొరత వేధిస్తోందని తెలుపుతూ సాక్షి పత్రికలో ‘యూరియా.. ఏదయా’ శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తూలుగు ప్రాథమిక సహకార పరపతి సంఘం, డీసీఎంఎస్‌లకు రెండు లారీల యూరియాను మార్కెఫెడ్ అధికారులు పంపించారు. అయితే పీఏఎస్ యాప్‌లోనే రైతులకు ఆధార్ ద్వారా అమ్మకం చేపట్టాల్సి రావడంతో అమ్మకాలు జరగలేదు. కాగా అదే సమయంలో బుధవారం కూడా ప్రైవేటు వ్యక్తులు అధిక ధరలకు అమ్మకాలు కొనసాగించారు. కానీ విజిలెన్సు, వ్యవసాయ శాఖాధికారులు స్పందించలేదు.

వర్సిటీ ప్రగతికి సహకరించాలి



మధుమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ రజనీ మంగళగిరిలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్ కె.మధుమూర్తిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ ప్రగతికి కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం వర్సిటీలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ నిర్వహణ వివరించారు.

స్వర్ణ కిరీటానికి బంగారం విరాళం



అర్చకునికి బంగారం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో వేంచేసిన భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం నూక అప్పారావు, అతని సోదరులు కలిసి 5 గ్రాముల బంగారం విరాళంగా బుధవారం అందించినట్లు అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

జిల్లాలోని అన్ని ఆలయాల్లో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, సామూహిక లలితా సహస్రనామ పారాయణలు చేపట్టారు. అలాగే పలుచోట్ల అన్నప్రసాద కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: గోవిందనగర్‌కాలనీలో రాజరాజేశ్వరీ దేవికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాతకు అభిషేకం



శ్రీకాకుళం కల్చరల్: బలగ బాలత్రిపుర కాలభైరవాలయంలో అమ్మవారికి అభిషేకం



శ్రీకాకుళం కల్చరల్: చామంతులతో విజయ గణపతికి అర్చనలు



శ్రీకాకుళం కల్చరల్: కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుక



ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం తీరంలో స్నానాలు చేస్తున్న ప్రజలు

అథ్లెటిక్స్‌లో సిక్కోలు హవా



పతకాలు సాధించిన మాస్టర్ అథ్లెట్స్ వీరే

- 26 పతకాలతో రాణించిన వెటరన్ అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సిక్కోలు సత్తాచాటింది. అనంతపురంలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 43వ ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు మొత్తం 26 పతకాలతో సత్తాచాటారు. వీటిలో మూడు బంగారు, ఆరు రజతాలు, మరో 17 కాంస్య పతకాలు ఉన్నాయి. జిల్లా నుంచి 25 మంది ప్రాతినిధ్యం వహించిన ఈ పోటీల్లో ఆకాశమే హద్దుగా రాణించి విజయబావుటా ఎగురవేశారు. ముఖ్యంగా ఈశ్వరరావు, భాగ్యలక్ష్మి, లక్ష్మీకాంతం, బి.లక్ష్మణరావు మూడేసి పతకాలు సాధించి యువ ఆటగాళ్లకు ఆదర్శంగా నిలిచారు. పతకాలు సాధించిన వీరిని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, చీఫ్ ప్యాట్రన్ చౌదరి పురుషోత్తమనాయుడు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, ఎం.భాగ్యలక్ష్మి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, కొన్న వెంకటేశ్వరరావు(వాసు), మధుసూదనరావు, పి.తవిటయ్య, డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, పీఈటీ సంఘ నాయకులు అభినందించారు. జాతీయ పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి జిల్లాకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.

వ్యక్తిగత ప్రదర్శనలు

- 70+ వయో విభాగంలో అన్నెపు ఈశ్వరరావు మూడు పతకాలు సాధించి మరోసారి సత్తాచాటారు. 5 కిలోమీటర్ల వాక్‌లో బంగారు పతకం, 5 కిలోమీటర్ల రన్నింగ్‌లో రజతం, 1,500 మీటర్ల రన్నింగ్‌లో రజతం సాధించి చరిత్ర సృష్టించారు.
- 55+ వయో విభాగంలో ఎం.భాగ్యలక్ష్మి మూడు పతకాలతో మెరిశారు. జావెలిన్ త్రోలో బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం సాధించి సత్తాచాటారు.
- 35+ వయో విభాగంలో ఎస్.లక్ష్మీకాంతం, బి.లక్ష్మణరావు మూడు పతకాలతో రాణించారు. లక్ష్మీకాంతం షాట్‌పుట్‌లో బంగారం, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో కాంస్య పతకాలతో అదుర్స్ అనిపించగా, లక్ష్మణరావు డిస్కస్‌త్రోలో రజతం, జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో కాంస్య పతకాలతో శభాష్ అనిపించారు.
- 65+ వయో విభాగంలో పి.అప్పారావు జావెలిన్ త్రో, హేమర్‌తోలో కాంస్య పతకాలతో మరోసారి జోరు కనబర్చారు.
- 50+ వయో విభాగంలో చల్లా జగదీష్ హైజంప్, లాంగ్ జంప్‌లలో రజత పతకాలు సాధించి మెరిశారు.
- వివిధ వయో విభాగాల్లో జె.రవి షాట్‌పుట్‌లో రజతం, జావెలిన్ త్రోలో కాంస్యం, పి.జోగారావు లాంగ్ జంప్‌లో రజతం, షాట్‌పుట్, హైజంప్‌లో కాంస్య పతకాలు, వి.చిన్నబాబు హైజంప్, లాంగ్ జంప్‌లో కాంస్య పతకాలు, ఎం.తోటారావు 5కే వాక్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలు, ఎస్.సారధి 5కే వాక్‌లో, 1500 రన్‌లో కాంస్య పతకాలు సాధించారు.



పతకాలు సాధించిన భాగ్యలక్ష్మి



రాణించిన పాలకొండ అప్పారావు



మూడు పతకాలతో సత్తాచాటిన అన్నెపు ఈశ్వరరావు

రూ.20 వేల విరాళం



అన్నపూర్ణ సంఘానికి విరాళం అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు రూ.20 వేలు విరాళంగా వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన అన్నెపు విశ్వనాథం తన తండ్రి జ్ఞాపకార్థం రూ.10 వేలు, పట్టణానికి చెందిన కవిత తన తల్లి జ్ఞాపకార్థం రు.10 వేలు విరాళంగా కార్యదర్శి కిల్లాన పల్గుణరావుకు బుధవారం అందజేసినట్లు అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో లోకనాథం, రామారావు, శ్రీరాములు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ మంజూరు చేయాలి



పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జి.సిగడాం: మండలంలోని గెడ్డకంచరాం గ్రామానికి హైస్కూల్ మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో హైస్కూల్ లేకపోవడంతో 8, 9, 10 తరగతులు చదివేందుకు విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనివలన మార్గమధ్యలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఇదివరకే జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేశామని, ఇప్పటికైనా స్పందించాలని విన్నవించారు.

ఉత్తమ నాటికగా ‘నిశ్శబ్దమా నీ ఖరీదెంత’

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ముత్యాలమ్మ కళానికేతన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా విశాఖకు చెందిన తెలుగు కళా సమితి ప్రదర్శించిన ‘నిశ్శబ్దమా నీ ఖరీదెంత’ నాటిక నిలిచింది. అలాగే ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ‘చిగురుమేఘం’, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విజయవాడకు చెందిన మైత్రీ కళా నిలయం వారు ప్రదర్శించిన ‘బ్రహ్మస్వరూపం’ నిలిచాయి. అలాగే వ్యక్తిగత ప్రదర్శనల్లో సైతం పలువురు విజేతలుగా నిలిచారు.

సైకి వ్యవసాయ కళాశాలకు ఐకార్ గుర్తింపు



ఐకార్ గుర్తింపు ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న డైరెక్టర్ శ్రీరాంమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎస్ఆర్ పురంలో వికాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకి వ్యవసాయ కళాశాలకు ఐకార్ (ఇండియాన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) గుర్తింపు లభించినట్లు వికాస్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తి తెలియజేశారు. ఈ మేరకు కళాశాలలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. 2016లో ఏర్పాటు చేసిన ఈ కళాశాల నుంచి ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌ల విద్యార్థులు రిలీవ్ అయ్యారన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఏజీ బీఎస్సీలో 70 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నామని, ఇకపై 156 మందికి ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలియజేశారు. రెండేళ్ల వ్యవసాయ డిప్లొమోలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఏజీ బీఎస్సీ, డిప్లొమో పూర్తిచేసిన విద్యార్థులకు అనేక రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు చెప్పారు. ఐకార్ గుర్తింపు వలన విద్యార్థులకు మరింత మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్య అందుతుందని చెప్పారు. సమావేశంలో అసోసియేట్ డీన్ మోష, మేనేజ్‌మెంట్ సభ్యుడు బి.రఘుకార్తీక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రావణి, రాజారుషి పాల్గొన్నారు.